క్లుప్తంగా

జాబ్ మేళాకు విశేష స్పందన



మాచర్ల : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీఎస్ ఎస్‌డీసీ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిరుద్యోగ నిర్మూలనకు జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని ఎస్‌కేఆర్‌బీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీకుమారి అన్నారు. మంగళవారం ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాకు 120 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మూడు కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 46 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆయా కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. కార్యక్రమంలో జూలకంటి అక్కిరెడ్డి పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీరావు, జిల్లా ఉద్యోగ కల్పన అధికారి ఎం.రవీంద్రనాయక్, మాచర్ల స్కిల్ కో ఆర్డినేటర్ ఆర్.కిరణ్ నాయక్, నాని నాయక్, కంపెనీల ప్రతినిధులు, హెచ్‌ఆర్‌లు, కళాశాల అధ్యాపకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

పట్టణంలో గుడ్ మార్నింగ్ కార్యక్రమం



మాచర్ల : పట్టణంలో గుడ్ మార్నింగ్ మాచర్ల కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా షెరిన్ కాలనీ కళాకారులు, ఎరుకల రూప్‌లైన్ కాలనీల్లో అధికారులతో కలిసి మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయం, డ్రెయినేజీ సమస్యలు మున్సిపల్ చైర్మన్ దృష్టికి ప్రజలు తెచ్చారు. సమస్యలపై స్పందించిన చైర్మన్ సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వీరితోపాటు ఏఈ గౌతమి, ఆదిత్య తదితరులు ఉన్నారు.

పెన్షనర్లకు సత్కారం



పిడుగురాళ్ల : స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ పిడుగురాళ్ల శాఖ ఆధ్వర్యంలో సీనియర్ పెన్షనర్లకు మంగళవారం సత్కారం నిర్వహించారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి శేషగిరిరావు పాల్గొన్నారు. అసోసియేషన్ కార్యవర్గం 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లను ప్రపంచ పెన్షనర్స్ డేను పురస్కరించుకుని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సేవలు చిరస్మరణీయం



మాచర్ల : స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని మంగళవారం కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో నిర్వహించారు. తెలుగు తిథుల ప్రకారం రామకృష్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పవరపు గాంధీ అధ్యక్షతన వివేకానంద జయంతి కార్యక్రమం నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.కమలహాసన్‌రావు మాట్లాడుతూ దేశ చరిత్రను ప్రపంచ నలుమూలలకు తెలియజేసిన ఘనత స్వామి వివేకానందకే దక్కుతుందన్నారు. ప్రపంచంలో పలు దేశాల్లో పర్యటించి దేశ సంప్రదాయాలను ప్రచారం చేశారన్నారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎం.బాబు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ముప్పవరపు వెంకటనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

దిగుబడి ఆశాజనకం.. ధర పతనం

- అగమ్యగోచరంగా కంది, మిరప రైతుల పరిస్థితి
- పట్టించుకోని ప్రభుత్వం
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు



కల్లాల్లో ఆరబోసిన మిర్చి

దుర్గి: రైతు సంక్షేమమే తమ ధ్యేయమంటూ కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎప్పటిలాగే రైతులను దగా చేస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా రైతుకు ఒక్క రూపాయి సాయం చేయకపోగా రైతు భరోసా లాంటి పథకాలకు ఎగనామం పెట్టింది. మిర్చిలో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా గత ఏడాదితో పోలిస్తే కనీసం మద్దతు ధర కూడా దక్కకపోవటంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కందిలో దిగుబడులు సాధారణంగా ఉన్నప్పటికీ ధరలు మాత్రం భారీగా పతనమవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం మిర్చి, కంది పంటలకు మద్దతు ధరకు మించి పంట దిగుబడులను కొనుగోలు చేయటంతో రైతులు ఉత్సాహంగా ఈ ఏడాది మిర్చి, కంది పంటలను భారీగా సాగు చేశారు. కంది పంట జిల్లా వ్యాప్తంగా 27 వేల హెక్టార్లకు పైగా మిరప 1.10 లక్షల ఎకరాలలో సాగు చేశారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించటంతో గంపెడాశలతో భారీగా పెట్టుబడులు పెట్టారు. మిర్చి మొక్క రూ.1 పైగా కొనుగోలు చేయటంతో పాటు, కాంప్లెక్స్ ఎరువులు, కూలీల ధరలతో సుమారు ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టారు. అదే విధంగా కంది రైతులు ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు.

నేడు రూ.6500 లోపే అమ్మకాలు

గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలలో క్వింటా కందులను రూ.9,500 నుంచి రూ.10,500కు రైతుల వద్ద నేరుగా కల్లాల్లోనే కొనుగోలు చేశారు. దీంతో రైతులు మంచి లాభాలు ఆర్జించారు. నేడు కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,550కి గాను దళారులు రూ.6 వేల నుంచి రూ.6500కు కొనుగోలు చేస్తూ రైతులను నిండా ముంచుతున్నారు.

ఆత్మహత్యలే శరణ్యం

ప్రస్తుతం మిర్చి పంట దిగుబడులు విరివిగా వస్తున్నాయి. మిర్చి పంటలో ప్రసిద్ధి గాంచిన తేజ, ఆరుమూరు రకాలు విస్తారంగా సాగు చేసి తమ కష్టానికి తగిన ఫలితం వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. నేడు తేజ రకం కేవలం క్వింటా రూ.12,500 నుంచి రూ. 13వేల మధ్యలోనే కొనుగోలు చేస్తున్నారు. ఇదే రకం గత ఏడాది రూ.20 వేలకు పైగా అమ్మకాలు కొనసాగాయి.

■ అదే విధంగా ఆరుమూరు రకం గతంలో రూ.13 వేల నుంచి రూ.14 వేలు పలికితే.. నేడు రూ.9 వేల నుంచి రూ.9500 మధ్య పలుకుతుంది. సంక్రాంతి పండగ తరువాత మిర్చి పంట మార్కెట్‌లోకి వస్తున్నా ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవటం దురదృష్టకరమని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే స్పందించి మిర్చి, కంది రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. లేకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని కన్నీటి పర్యంతమవుతున్నారు.



మిర్చిని కాటాకి ఎత్తుతున్న కూలీలు

మిర్చి రైతులను ఆదుకోవాలి



గత సంవత్సరంలో తేజ రకాన్ని పండించి మంచి లాభాలు రావటంతో, ఈ ఏడాది కూడా ఆ రకాన్నే సాగు చేశాను. మూడు ఎకరాలకు గాను రూ.3.50 లక్షలకు పైగా పెట్టుబడి అయ్యింది. కూలీలకు రూ.1.50 లక్షలకు పైగా అయ్యింది. రూ.12500కు క్వింటా అమ్మకాలు జరిపితే నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది.

–దొండపాటి అంజయ్య, రైతు, ముటుకూరు

ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోవాలి



కూటమి ప్రభుత్వం కేంద్రం ప్రభుత్వంలో కీలకంగా ఉన్న దృష్ట్యా స్థానిక ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేటి మిర్చి ధర పతనమని కేంద్ర వాణిజ్య శాఖ దృష్టికి తీసుకెళ్లి వెంటనే జోక్యం చేసుకొని మిర్చి రైతులను ఆదుకోవాలి. లేకపోతే మాకు అప్పులే మిగులుతాయి.

–రాయపాటి బ్రహ్మయ్య, రైతు, అడిగొప్పల

ఎక్కడ అమ్ముకోవాలో తెలియదు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్వింటా కందికి మద్దతు ధర రూ.7550 ప్రకటించినా కేవలం పేపర్లకు మాత్రమే పరిమితమైంది. గత 15 రోజులుగా కంది పంట మార్కెట్‌లోకి వస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎక్కడ అమ్ముకోవాలో తెలియక మా పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు కలుగజేసుకొని రైతులను ఆదుకోవాలి.

–అదపాల అంబారావు, కంది రైతు, ఆత్మకూరు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. 11 కేవీ లైన్ల మెయింటెనెన్స్‌లో భాగంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. నెహ్రూనగర్, గుంటూరు ఏరియా రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాచర్లలో 'ఉక్కు సత్యాగ్రహం' సక్సెస్ మీట్

మాచర్ల : విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరగకూడదనే ఉద్దేశంతో పల్నాడులోని మాచర్ల నియోజకవర్గానికి చెందిన ప్రముఖ సినీ నిర్మాత పులుసు సత్యారెడ్డి హీరో, నిర్మాత దర్శకుడిగా వ్యవహరించి మాచర్ల పట్టణానికి చెందిన వేముల శ్రీనివాసరావు సినీ రచయితతో రూపొందించిన ఉక్కు సత్యాగ్రహం సినిమా 50 రోజులు పూర్తి చేసుకోవడంతో మంగళవారం మాచర్ల పట్టణంలో సంబరాలు నిర్వహించారు. విశాఖపట్నంలోని ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరుగుతుందని తెలుసుకున్న సత్యారెడ్డి ఆ ప్రాంత వాసులను కలిసి స్టీల్ ప్లాంట్ హక్కులను పరిరక్షించేందుకు ఉక్కు సత్యాగ్రహం సినిమాకు రూపకల్పన చేశారు. మాచర్ల బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద రచయిత వేముల శ్రీనివాసరావు అధ్యక్షతన సంబరాలు నిర్వహించారు. విశాఖ ప్రాంత వాసులు సినిమాకు బ్రహ్మరథం పట్టి 50 రోజులు విజయవంతంగా పూర్తి చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అభిమానులతో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు సత్యాగ్రహం రచయిత వేముల శ్రీనివాసరావును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదు

ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి

రెంటచింతల: వలసలను నివారించేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో జాబు కార్డు కలిగిన వారికి పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంసీసీ సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ 2025 జనవరి 1వ తేది నాటికి గ్రామాలలో ఉపాధి పనులు ప్రారంభించని ఫీల్డ్ అసిస్టెంట్లకు వెంటనే షోకాజ్ నోటీస్‌లను జారీ చేయమని ఆదేశించారు. వ్యవసాయ, ఇతర పనులు లేని సమయంలో కూలీలకు పనులు చూపించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ల దేనన్నారు. చిన్న, సన్న కారు రైతులకు ఉపయోగపడేలా పంట కాల్వల అభివృద్ధి పనులకు, ఉద్యాన పంటలైన పండ్ల తోటల సాగుకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. కూలీలకు ఒక రోజుకు రూ.300 తగ్గకుండా చూడాలన్నారు. అనంతరం రెంటచింతల గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కె.సరోజినిదేవి, ఏపీడీ కొరటా మల్లిఖార్జునరావు, ఏపీఓ జయచంద్రకుమార్, ఎంసీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి

ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీస్‌లు ఎంపీడీవో సరోజినిదేవి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో 2025 జనవరి 1వ తేదీ నాటికి ఉపాధి పనులు ప్రారంభించని 5 గ్రామాలకు చెందిన ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీస్‌లను జారీ చేసినట్లు ఎంపీడీవో సరోజినిదేవి మంగళవారం తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంసీసీ సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉపాధి పథకం ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి మాట్లాడుతూ ఇచ్చిన ఆదేశాల మేరకు వెంటనే గోలి, మల్లవరం, మిట్టగుడిపాడు, పాలువాయి, పాలువాయిగేటు గ్రామాలలో ఉపాధి పనులు ప్రారంభించని ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీస్‌లను జారీ చేయడం జరిగిందన్నారు. ప్రతి రోజు ఉపాధి కూలీలకు పని కల్పించాలని అనేక పర్యాయాలు తెలియజేసినా పని కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నోటీస్‌లు అందిన రెండు రోజులలో లిఖితపూర్వకంగా సంజాయిషీ వ్యక్తిగతంగా కార్యాలయంలో సమర్పించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. సకాలంలో సంజాయిషీ సమర్పించనిచో ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించడం(సస్పెండ్) జరుగుతుందన్నారు.

పశు ఆరోగ్య శిబిరం పశు పోషకులకు వరం

పశు వైద్యాధికారి బషీర్

రెంటాల(రెంటచింత): రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు పశు పోషకులకు ఓ వరమని మండల పశు వైద్యాధికారి షేక్ బషీర్ అన్నారు. మంగళవారం రెంటాల గ్రామంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో నిర్వహిస్తున్న శిబిరంలో 65 మంది పశు పోషకులకు చెందిన 14 ఆవులకు, 48 గేదెలకు గర్భకోశ వ్యాధి పరీక్షలు, అనారోగ్యంగా ఉన్న 62 పశువులకు చికిత్సలు చేయడం జరిగిందన్నారు. 600 జీవాలకు, దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశామన్నారు. గ్రామాలలో నిర్వహిస్తున్న ఈ శిబిరాలలో ఉచితంగా పశువులకు ఆరోగ్య పరీక్షలు, తేలికపాటి శస్త్రచికిత్సలు, ఎదకురాని, చూలు కట్టని, ఇతర గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ కిరణ్‌కుమార్, ఉప సర్పంచ్ పేరం సర్వారెడ్డి, మాజీ సర్పంచ్ బైరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పశు వైద్య సిబ్బంది నాగమణి, రమేష్‌నాయక్, త్రివేణి, కవిత, గ్రామ పెద్దలు చేర్రెడ్డి కోటిరెడ్డి, చేర్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సిద్ధవటం వెంకటరెడ్డి, చేర్రెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దూడకు నట్టల నివారణ మందును వేస్తున్న మండల పశు వైద్యాధికారి బషీర్



పశు ఆరోగ్య శిబిరం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మండల పశు వైద్యాధికారి బషీర్, గ్రామ పెద్దలు

భూములను సాగు చేసుకునే అవకాశం కల్పించండి

దాచేపల్లి : ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టేంత వరకు భూములను సాగు చేసుకుని జీవించే అవకాశం కల్పించాలని బాధిత రైతులు కోరారు. మండలంలోని గామాలపాడు గ్రామ సచివాలయం వద్ద మై హోం సిమెంట్ ఫ్యాక్టరీ బాధిత రైతుల సమావేశం మంగళవారం జరిగింది. ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులతో ముఖాముఖి చర్చించేందుకు రెవెన్యూ అధికారులు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. మై హోం సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులు చర్చలకు హాజరుకాలేదు. దీంతో ప్రస్తుత పరిస్థితులను తహసీల్దార్ వైపీ కుటుంబరావు జిల్లా కలెక్టర్‌కి సమాచారం అందించారు. మరోసారి ప్రతినిధులకు నోటీసులు ఇచ్చి చర్చలు జరిపేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కుటుంబరావు హామీ ఇచ్చారు. గత 20 ఏళ్ల క్రితం మై హోం సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూములు ఇచ్చామని, ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకపోవటం వలన తాము ఉపాధి కోల్పోయామని రైతులు తహసీల్దార్‌తో చెప్పారు. ఫ్యాక్టరీ నిర్మించేంత వరకు తాము ఇచ్చిన భూముల్లో పంటలు సాగు చేసుకునే అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ కుటుంబరావు

జానపాడు గ్రామంలో 'పొలం పిలుస్తోంది'

పిడుగురాళ్ల : కంది పంటలో మారుకా మచ్చల పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని అందుకు వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని జానపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంది పంట క్షేత్ర సందర్శన చేయడం జరిగిందన్నారు. కంది పంటలో మారుకా మచ్చల పురుగు ఉన్నట్లు గమనించడం జరిగిందని దీని నివారణకు క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ. ఒక లీటర్ నీటికి లేదా ఫ్లూంబెడమైడ్ 50 గ్రాములు లీటర్ నీటిలో లేదా కొరాజెన్ 60 మి.లీ. లీటర్ నీటికి కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు తీసుకుని మంచి దిగుబడి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో చౌదరి రెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

చర్లగుడిపాడులో పొలం పిలుస్తోంది

గురజాల రూరల్ : మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సచివాలయం-2 పరిధిలో మండల వ్యవసాయాధికారి ఎం.సంధ్యారాణి హాజరై మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుని మంచి దిగుబడులు సాధించాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో విస్తరణ సేవలు రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేసి తక్కువ పెట్టుబడితో మేలైన దిగుబడులు సాధించేందుకు సూచనలు ఇస్తామన్నారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

దాచేపల్లి ఎంఈవో-1గా మల్లిఖార్జునశర్మ

దాచేపల్లి : మండల విద్యాశాఖ అధికారి-1గా బి.మల్లిఖార్జునశర్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈవో-1గా విధులు నిర్వహించిన కాంతారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. బెల్లకొండ ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న మల్లిఖార్జునశర్మకి దాచేపల్లి ఎంఈవో-1గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో-1గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బందితో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఈవో మల్లిఖార్జునశర్మని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పిడుగురాళ్ల : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని రైలు నుంచి తుమ్మలచెరువు, పిడుగురాళ్ల స్టేషన్‌ల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి కింద పడినట్లు గమనించారు. స్థానికులు రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తిని 108 వాహనం ద్వారా గుంటూరు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ గాయాలపాలైన వ్యక్తి మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి సుమారు 38 నుంచి 40 సంవత్సరాల వయసు ఉండొచ్చని అన్నారు. మృతుని ఆచూకి తెలిసిన వారు నడికుడి రైల్వే పోలీసులకు 7780171069, 9949063960 నెంబర్లలో తెలియజేయాలన్నారు.

పారాగడ్డి పెంపకం లాభదాయకం

అమరావతి: మండలంలోని రైతులు ప్రస్తుతం ఉన్న వరిగడ్డి కొరతను నివారించేందుకు అధిక దిగుబడినిచ్చే పారాగడ్డి పెంచాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు వెంకట్రామయ్య తెలిపారు. మంగళవారం ధరణికోట పశు వైద్యశాలలో పారాగడ్డి పెంపకం గురించి రైతులకు వివరించారు. పారా గడ్డిని హెక్టారుకు 8 నుంచి 10 క్వింటాళ్ల కాండపు ముక్కలు గాని, 90 వేల నారు మొక్కలు నాట వచ్చునని తెలిపారు. హెక్టారుకు 80 నుంచి 100 టన్నుల వరకు పారా గడ్డి దిగుబడి వస్తుందన్నారు.

అన్న క్యాంటిన్‌లో ఆకస్మిక తనిఖీ

సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా సెంటర్‌లో గల అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అల్పాహారం ఎలా ఉందని అక్కడ వారిని అడిగి తెలుసుకున్నారు. అల్పాహారం నిర్ణీత సమయాలకు అందుతుందా? లేదా? అనే వివరాలను ఆరా తీసి మెనూ పరిశీలించారు. ఈ సందర్భంగా 7వ వార్డు కౌన్సిలర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్‌కుమార్ పేదలకు అన్న క్యాంటీన్ టోకెన్లను కొనుగోలు చేసి ఉచితంగా అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

లక్కీ డ్రా విజేతలకు బహుమతుల ప్రదానం

సత్తెనపల్లి: పట్టణంలోని పోలీసుశాఖ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో నిర్వహించిన ఐఓసీఎల్ స్కీంలో లక్కీ డ్రా ద్వారా గెలుపొందిన విజేతలకు పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. బంక్ వద్ద విజేతలు శ్రీనివాసరావు, నరేష్ కుమార్, అయ్యప్ప స్వామి, సత్యనారాయణ, జయరాంలకు ట్రావెల్ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

పింఛన్ల తనిఖీ

సత్తెనపల్లి: అనారోగ్య పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల పత్రాలను మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది మంగళవారం తనిఖీ చేశారు. పట్టణంలో 8 మంది పింఛన్‌దారుల గృహాలకు వెళ్లి మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, వైద్యుల బృందం ఆరా తీశారు. వారి ధ్రువపత్రాలను పరిశీలించి క్షేత్రస్థాయిలో వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఆ వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేశారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

మునిసిపల్ కమిషనర్ శ్రీధర్

పిడుగురాళ్ల : ప్రభుత్వం నిర్మించనున్న ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మునిసిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ మునిసిపల్ కార్యాలయం పరిధిలో ప్రభుత్వం నిర్మించనున్న ఇంటి నిర్మాణాల్లో ఇప్పటివరకు పల్నాడు జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నామని అదే విధంగా ప్రతి వారం ఇంటి నిర్మాణాలు పూర్తి చేస్తూ మొదటి స్థానంలోనే ఉండాలన్నారు. ఈ వారంలో 14 ఇళ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. వచ్చే వారంలో మరొక 30 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బంగారయ్య, మునిసిపల్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ శ్రీధర్